కథా నిలయం
శ్రీకాకుళం

# 10. నాన్న

ఆ క్షణాలు నాకు మరపురావడంలేదు. నాన్న చివరి క్షణాలు. కళ్లు తెరచి అతి కష్టంమీద నా చేతినందుకుని పట్టు కుదరక వదిలేస్తే, చటుక్కున నేనా చేతినందుకుని మరోచేత్తో నిమురుతూ.... నా కళ్లు జలపాతాలౌతూండగా, పెగిలీ పెగలని గొంతుతో "నీకేం కాదు నాన్నా, నీకు నేనున్నాను... నిన్నింకా బతికించుకుంటాను" అని నేనంటూండగా...

వేలితో ఆమెను చూపించి ఏదో చెప్పబోయి మాటరాక గొంతుమూగపోయి జీవుడు పెనుగులాడుతూండగా... నేనామెవైపు అసహ్యంగా, అసహనంగా చూసాను. ఆమె.... నా తల్లిగా భావించడానికి నేనిష్టపడని, 'అమ్మా' అని పిలవాలన్పించని హేమ, ఏ హాసమూ ఎన్నడూ ప్రదర్శించని అదే నిర్లిప్తపు ముఖంతో లేచి నెమ్మదిగా అడుగులేస్తూ లోపలి గదిలోకెళ్లిపోయింది.

నాన్న మనోగతం నెరవేర్చిన ఆనందంతో నేనాయన వైపు చూడబోగా తల అడ్డంగా తిప్పుతూ నాన్న నిశ్చేతనమై పోయాడు. నేనొక్కసారిగా కుప్పకూలిపోయి భోరుమన్నాను, ఇరవై మూడేళ్ల నా జీవితానికి నాన్నే అన్నీ, నాకు మిత్రుడు, శ్రేయోభిలాషి, నాకోసం ఏం చెయ్యడానికైనా సిద్ధపడే నాన్నంటే నాకు ప్రాణం. ఎన్ని చేసాడు నాకోసం! నాకు సొంతంగా చేతనయ్యేవరకు లాలపోసి, బట్టలు తొడిగి, ఎత్తుకుని గారాబంచేస్తూ తినిపించి, ఆటలాడించి, జోకొట్టి, బజ్జోబెట్టి అమ్మగా కూడా నాన్నే అయ్యేడు. ఆవిడ లోపల్నుంచి ఎప్పుడొచ్చిందో నా ఏడుపుని గమనిస్తూ తిరిగి అదే స్థానంలో కూర్చుంది. అదే నిర్లిప్తత. కంటినుంచి ఒక్క కన్నీటి బొట్టైనా రాల్చలేదు. రాయిలాగా కూర్చుంది. ఇదింతేలే, ఇలాగే జరగాల్సివుంది అన్నట్టు నాన్న శరీరంవైపు చూస్తోంది.

లోపలికెళ్లినప్పుడు ఫోన్ చేసినట్టుంది డాక్టరంకుల్ వచ్చాడు. కారు దిగి పరుగులాంటి నడకతో వస్తూనే నాన్న చెయ్యందుకుని నాడి చూసాడు. అంతా అయిపోయిందన్నట్టు చేతిని వదిలేసాడు. ఓదార్పుగా నా తలమీద చెయ్యివేసి నిమిరి, ఆవిడ దగ్గరకి నడిచేడు.

ఎవరెవరివో ఫోన్ నెంబర్లు అడిగి నాన్న తరఫు బంధువులందరికీ ఫోన్లు చేసాడు. ఆవిడ తరఫు వాళ్లెవరూ లేరు. ఉన్న తమ్ముడొక్కడూ ఆర్మీలో పనిచేస్తూ యాక్సిడెంట్లో మరణించేడు.

డాక్టరంకుల్ వెళ్లబోతూ "హేమా, వర్రీ కావద్దు, నీ శక్తిమేరకు సేవలు చేసేవు. నువ్వలా చేసి ఉండకపోతే శివరాం ఇన్నాళ్లు బతికి ఉండడు. నీ బాధ్యత నువ్వు నెరవేర్చావు. ఈ కాలంలో ఎవరూ కదల్లేకుండా మంచం పట్టిన వ్యక్తిని నీలా చూసుకోరు తెలుసా" అంటున్నాడు ఇంగ్లీషులో. నాన్నకు మంచి ఫ్రెండాయన. ఆయన హాస్పిటల్లోనే ఈవిడ అసిస్టెంటుగా వర్క్ చేసేది.

ఆవిడ ఏమీ మాట్లాడకుండా అలాగే కూర్చుంది.

"నీలిమా! అమ్మకు ధైర్యం చెప్పూ" అన్నాడాయన.

ఆవిడకు నేను ధైర్యం చెప్పడమా? ఎంత ధైర్యవంతురాలు కాకపోతే పెరాల్సిక్కై నాలుగేళ్ళుగా మంచంపట్టిన నాన్నను, ఏడాదిగా బెడ్‌సోర్స్ వచ్చి గాంగ్రినైజైన నాన్నను ఎవ్వరి సాయంలేకుండా ఒక్కత్తీ చూసుకుంటుంది!

నాకు ఊహ తెలియనప్పుడు పాలిచ్చి పెంచిందేమో తెలీదు కాని, నాకు తెలిసినప్పటి నుంచి నాన్న చేతుల్లోనే పెరిగేను, ఉదయం నిద్రలేపడంతో మొదలుపెట్టి నిద్రపుచ్చేవరకు ఆమె ప్రమేయం లేకుండా అన్నీ తానై పెంచాడు. నాకు ఏ చిన్న అనారోగ్యం చేసినా తల్లడిల్లిపోయేవాడు. కళ్లల్లో వొత్తులేసుకుని నా మంచంపక్కనే కూర్చుని ఉండేవాడు, ఒకసారి నేను రోడ్డుమీద జారిపడి మోకాలు చెక్కుకుపోతే ఎంత హడావుడిచేసాడు! తన ప్రాణం పోయినంతగా విలవిలలాడి పోయాడు.

ఆవిడమాత్రం తీరికగా నిద్రలేచి, తయారై, నాన్న చేసిపెట్టిన వంటకాన్ని బాక్సులో సర్దుకుని ఉద్యోగానికెళ్లిపోయేది. నాన్నకు ఉద్యోగం లేదుమరి.

పాపం, నాన్నను చూస్తేనాకు జాలనిపించేది. ఒక నిస్సహాయతతో బాధపడుతున్నాడనిపించేది. నేను చూపించే ప్రేమే నాన్నను జీవింప చేస్తోందనిపించేది. నాన్న కూడా నాతో అలాగే అనేవాడు, ఎప్పుడో అవసరమైతే తప్ప నేను ఆమెను పలకరించడం కూడా మానేసాను.

చుట్టాలు పక్కాలు వచ్చారు. నన్నెంతో ప్రేమించిన నాన్న తరఫు బంధువులు నాకెంతో కావాల్సిన వాళ్లనిపించింది. వాళ్ల ఏర్పాట్లన్నీ స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించేను. రెండు రోజుల తర్వాత దుఖం కొద్దిగా తగ్గినా రోజులో ఏదో ఒక టైంలో నాన్న గుర్తుకొచ్చి ఏడుపొస్తోంది. వొంటరిగా నా గదిలోకి పోయి ఏడుస్తున్నాను. నేను గమనిస్తూనే ఉన్నాను. ఆమె రాయిలాగా అలాగే ఉంటోంది. ఇక చుట్టాలైతే మూడోరోజు నుంచీ

టీకులు, సినిమాలు – షికార్లు మొదలెట్టేరు. "ఎవరు మాత్రం ఎంతకాలం ఉండిపోతార్రా, అంతా వెర్రి" అంటూ వేదాంతమొకటి. నాన్న మంచం మీదున్నప్పుడు చూడ్డానికని వచ్చి వారాల తరబడి ఉండి సిటీలో వాళ్ల సొంత పనులు చేసుకుని వెళ్లిన వాళ్లు వీళ్లంతా.

జరగాల్సిన కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి. నాన్నకి కూతుర్నైనా కొడుకునైనా నేనే కాబట్టి పట్టుపట్టి తంతులన్నీ నా చేతులమీదుగానే చేసాను.

సరే, అంతా ముగిసింది. అందరూ వెళ్ళేరు.

ఇక, ఆమె నేను ఇద్దరమే మిగిలేం. ఆమె ముఖాన్ని చూస్తూ కూర్చోబుద్ధికాక నాకింకా ఆఫీసులో సెలవు నాలుగురోజులు మిగిలినా కేన్సిల్ చేసుకుని జాయినైపోయాను.

ఆఫీసులో ఉన్నా నాన్న గుర్తుకొస్తూ కళ్లు నీటి చెలమలౌతున్నాయి. ఎంతప్రేమ – ఎంత ప్రేమను నా మీద గుమ్మరించాడాయన! అందుకు కృతజ్ఞతగా నాన్న చెప్పిన ఏ మాటనూ జవదాటకుండా నడుచుకున్నాను. ఆయన కోరినట్టే ఇంజనీరింగ్ చదివేను. అవిడ నన్ను మెడిసిన్ చదివించాలనుకుందట. నాన్నకు అది ఇష్టంలేదు. "డాక్టర్లు ఇంటి బాధ్యత సరిగా నిర్వహించలేరమ్మా" అనేవాడు. అదీ నిజమే. ఉదయమెప్పుడో వెళ్లిపోయిన ఆమె రాత్రి నేను నిద్రపోయేక వచ్చేది. ఒకోసారి ఎమర్జెన్సీలని రాత్రులూ ఉండిపోయేది. అంతవరకూ ఆమెను 'అమ్మా' అని పిలిచిన నేను అలా పిలవడం మానేసిన సంఘటన ఒకటి నాకు చదవడం, అర్థం చేసుకోవడం వచ్చిన కొత్తల్లో జరిగింది –

నాన్న నాకొక ప్రేమలేఖ చూపించాడు. దాన్ని ఆవిడ పేరుతో చదువుకునే రోజుల్లో ఎవరో మురళి అనే వ్యక్తి రాసాడు. నిజానికి ఆ లేఖలో అద్భుతమైన ప్రేమ వ్యక్తీకరణ ఉంది. కాని, నాకు మాత్రం అసహ్యం వేసింది. ఇటు చూస్తే నాన్న కళ్లనిండా నీళ్లు, నాన్న ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని ఆరిందాలాగ ఓదార్చాను.

"నువ్వు మా అమ్మవమ్మా" అన్నాడు నాన్న. నాన్న పుట్టగానే ఆవిడ పోవడం వల్ల ఆయనకు తల్లి ప్రేమ లభించలేదు. అందుకే ఆవిడ పేరు 'నీలమ్మ'ను 'నీలిమ'గా నాకు పెట్టుకున్నాడు, అయినా నన్ను ఎప్పుడూ పేరుతో పిలిచేవాడు కాదు, అమ్మా అనే పిలిచేవాడు, ఇక ఇంట్లో బహుశా ఆ ప్రేమలేఖ వ్యవహారం తెలిసాక నాన్న ఆవిడకు దూరంగా జరిగి ఉంటాడు. కాని, ఆవిడతో మామూలుగానే వ్యవహరించేవాడు. ఎంత పెద్దమనసు నాన్నది!

నాన్న జ్ఞాపకాల్తో రోజులు భారంగా గడుస్తున్నాయి.

నెమ్మదిగా ఆమె నన్ను పలకరించడం మొదలుపెట్టింది. చిన్నప్పటి లాగే 'పాపా' అంటోంది. ఆఫీసుకెళ్ళేటప్పుడు బాక్స్ సర్దివ్వడం, రాత్రి అన్నం వడ్డించడం లాంటివి చేస్తోంది. నాకు దగ్గరవ్వాలని ప్రయత్నిస్తోందని నాకర్థమౌతోంది. కాని నాన్నను మరవలేని

నా మనసు మాత్రం ఆమెను అంగీకరించలేకపోతోంది. ముఖ్యంగా ఆ ప్రేమలేఖ... ఆమె నాన్నకు చేసిన పెద్ద ద్రోహంగానే నాకన్పిస్తోంది. ఆఫీసులో నా కొలీగ్ జీవన్ నాకు మంచి మిత్రుడు. నాన్నకు జబ్బు చేసిందని తెలిసి నన్ను ఓదారుస్తూ ఉండేవాడు. నాన్న పోయాక అతని సహానుభూతి నేను కోరకుండానే లభించింది. ఆరోజు నేను ఆఫీసు నుంచి బయలుదేరబోతూండగా వచ్చి నాకొక గులాబిరంగు కవరిచ్చాడు. అతని నవ్వు మిస్చువస్‌గా ఉంది.

"'ఏమిటిది?' అన్నాను నేను ఆశ్చర్యంగా."

"'ఇక్కడ తెరవకు, ఇంటికెళ్ళాక చదువు' అన్నాడు."

ఇదేంటిది కొత్తగా? పర్సులో పడేసి దానిమాట మరచిపోయాను.

నిద్రపోయేముందు గుర్తొచ్చి చూస్తే అదొక ప్రేమలేఖ, తెల్లని కాయితం మీద అందమైన నీలి అక్షరాల్తో పదం పదం చెక్కిన ప్రేమలేఖ. గమ్మున నాన్న చూపించిన ప్రేమలేఖ గుర్తుకొచ్చింది. ఏదో తప్పు చేసిన భావనతో దాన్ని దూరంగా విసిరేసాను.

అతనికి నేనంత చనువిచ్చానా? గిల్టీగా అన్పించింది.

'లేదు నాన్నా! నిన్ను బాధించే పనులు నేనెప్పుడూ చెయ్యను' అనుకున్నాను.

మర్నాడు ఆఫీసులో జీవన్‌ని తప్పించుకుని తిరిగేను. ఆఫీసునుంచి బయలుదేరబోతూండగా డాక్టరంకుల్ నుంచి ఫోన్ తననో సారి కలిసి వెళ్లమని.

వెళ్ళేను -

"ఎలా ఉన్నావురా?"

"బావున్నానంకుల్"

"నీకో విషయం చెప్పాలని పిలిచేను. రేపట్నుంచి మీ అమ్మ తిరిగి డ్యూటీలో జాయినౌతానంటోంది".

"అవసీయుండంకుల్, అది ఆమె స్వవిషయం. నా కెందుకు చెప్పడం" షార్ప్‌గా అన్నాను.

"సరే సరే, అసలు విషయం... ఇదిగో దీన్ని తను పోయాక నీ కిమ్మని మీ నాన్న నాకిచ్చాడు. నువ్వు తప్పకుండా చదివి తీరాలని కూడా చెప్పేడు" డైరీ ఒకటి డ్రాలోంచి తీసి ఇచ్చాడు. నల్లని లెదర్ బైండు చేసిన పెద్దసైజు డైరీ. దీన్ని నాన్న దగ్గర చాలాసార్లు చూసాను.

ముఖ్యమైన సంఘటనల్ని నాన్న దాంట్లో వ్రాసుకునే వాడని నాకు తెలుసు. ఆర్తిగా దాన్ని తీసి గుండెకు హత్తుకున్నాను.

డాక్టరంకుల్ నవ్వుతూ తల పంకించి "ఆల్ ద బెస్ట్" అన్నాడు.

నాన్న తన డైరీని నన్నెందుకు చదవమన్నాడు? నా కోసం ఏం రాసి పెట్టేడు? ఆఘమేఘాల మీద ఇంటికొచ్చి పడ్డాను. నా రూంలోకెళ్ళి తలుపు మూసుకొని, టేబుల్ లేంపు స్విచ్‌నొక్కి మంచం మీద వాలిపోయేను –

ఎప్పుటెప్పటివో నాన్న జ్ఞాపకాలు డైరీనిండా.

తల్లి ప్రేమ ఎరుగని తన బాల్యం నాటి ఓటములు, తండ్రి ఇచ్చిన కొద్దిపాటి పొలాన్ని అమ్మి బిజినెస్‌లో పెట్టి ఆర్థికంగా ఎదగడం, డాక్టర్ మురళీధర్‌తో స్నేహం, అతని హాస్పిటల్లో అసిస్టెంటుగా ఉన్న హేమతో పరిచయం ప్రేమగా మారడం, పెళ్లి జరగడం, తర్వాతెప్పుడో అందరూ సరదాగా కబుర్లు చెప్పుకొంటున్నప్పుడు మురళీధర్ తను చదువుకొనే రోజుల్లో హేమకు ప్రేమలేఖ ఇచ్చానని, దాన్నామె మర్యాదగా తిరస్కరించి వెనక్కి ఇచ్చేసిందని చెప్పి ఆ లేఖను చదివి విన్పించి అందర్నీ నవ్వించడం, దాన్ని తనకిమ్మని అడిగి తీసుకుని తన డైరీలో దాచడం – (ఆ పేజీలో నాన్న నాకు చూపించిన లేఖ ఉంది). నేను అమ్మ కడుపులో ఉన్నప్పుడు నాన్నకు బైక్ యాక్సిడెంటై వెన్నుకి దెబ్బతగిలి అది క్లినికల్ డిప్రెషన్‌కి దారితియ్యడం, దీర్ఘకాలం వైద్యం చేయించుకోవాల్సిరావడం, ఇకపై మానసికంగా, శారీరకంగా అలసట పనికి రాదని డాక్టర్లు చెప్పడం, అమ్మ పట్టుపట్టి నాన్న బిజినెస్‌ని వేరెవరికో అమ్మించేసి నాన్నను ఇంటిపట్టునే ఉంచెయ్యడం, నాన్నకు స్పెర్మ్‌కౌంటు దెబ్బతిని ఇక పిల్లలు పుట్టే అవకాశం లేదని తెలియడం, నా పైన నాన్న పెంచుకున్న అమితమైన మమకారం, నా ప్రేమ తన ఒక్కడికే దక్కాలనే పిచ్చి తాపత్రయం, ఇంట్లో నిర్వ్యాపారంగా ఉంటున్న నాన్నకు నాతోడిదే లోకం కావడం, చంటప్పుడు నేను అమ్మను వదలకపోతూంటే నాన్నకు కలిగిన జెలసీ, దాంతో కారణం లేకుండానే అమ్మతో గొడవలు పెట్టుకోవడం, అమ్మను మాటల్తో హింసించడం, ఎప్పటిదో ప్రేమలేఖ చూపించి అమ్మపైన నాకు ద్వేషం కలిగించడం, క్రమంగా తనకే తెలీని ఒక అపరాధ భావనలో కూరుకుపోవడం, ఇదంతా తెలిసి అమ్మ నాన్నకు సహకరించే క్రమంలో నన్ను పట్టించుకోకపోవడం – అన్నీ రాసి ఉన్నాయి.

డైరీ మూసి నిశ్చలనంగా ఉండిపోయాను. ఇదేనా చివరిక్షణాల్లో తల అడ్డంగా ఊపుతూ నాన్న ఏదో చెప్పాలనుకున్నది?

ఎందుకిలా చేసాడు నాన్న? తనకు దొరకని తల్లిప్రేమను నాకు అమ్మ ఉండీ దొరకకుండా చేసాడే! ఇదెక్కడి నాన్న!

పాపం అమ్మ... ఎంత సహనం వహించింది! తనకింత చేసిన నాన్న కోసం ఉద్యోగం వదిలేసి మరీ సేవలందించింది! నాకు తెలుసు, నాన్నకు అన్నీ తనే అయ్యింది. మంచంలో ఉన్న వ్యక్తిని పాలుతాగే పసివాణ్ణి తల్లి సాకినట్లు సాకింది. నాన్నను అంతగా ప్రేమించిందన్నమాట! నిజానికి నా కోసం ప్రాణం పెట్టిన నాన్నను ఏనాడైనా నేను దగ్గరుండి చూసుకున్నానా? కేవలం నాన్న బెడ్‌పక్కన కుర్చీలో కూర్చుని కబుర్లు మాత్రం చెప్పేదాన్ని. నాన్న నన్నెందుకింత ఫూల్‌ని చేసాడు? నేను మాత్రం? చిన్నప్పుడు సరే అజ్ఞానం, ఇంత ఎదిగి, చదువుకుని ఎంత అమానవీయంగా ప్రవర్తించాను!

నిజానికి ఒక ప్రేమలేఖ అందుకున్న వాళ్లది తప్పెలా అవుతుంది?

జీవన్ నాకు లేఖ రాయడంలో నా ప్రమేయం ఉందా అసలు?

అమ్మను ద్వేషిస్తున్నాననుకుని అమ్మా అన్న పిలుపునుంచి దూరమై నాకు నేనే అపకారం చేసుకున్నాను.

అమ్మ నన్ను క్షమిస్తుందా అసలు?

తలుపు తీసుకుని హాల్లోకి వచ్చాను. డైనింగ్ టేబుల్ మీద నా కోసం వడ్డిస్తున్న అమ్మ ఎప్పట్లాగే తలపైకెత్తకుండా తనపని తను చేసుకుపోతోంది. అక్కడే నిలబడి అమ్మను పరిశీలనగా చూసాను. నాన్న కోసం, నా కోసం మాత్రమే జీవిస్తూ, తనకంటూ ఒక సొంత ప్రపంచం లేకుండా చేసుకున్న అమ్మ... బెంగతో కొంత, చాకిరీతో కొంత చిక్కి నల్లబడింది. పాపిట్లో జుట్టు నెరిసింది.

టేబుల్ దగ్గరికి నడిచి అమ్మకెదురుగా నిలబడ్డాను. అమ్మ తలపైకెత్తి చూసింది. చెంపలు పల్చబడి కళ్లు పెద్దవిగా కన్పడుతున్నాయి.

'అమ్మా!' అన్నాను గొంతు పెగల్చుకుని. నా గొంతు దైన్యంగా వణికింది.

అమ్మ కళ్లు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి.

ఒక్క ఉదుటున అవతలి పక్కకెళ్లి వెనక నుంచి అమ్మను వాటేసుకున్నాను, అమ్మ స్థాణువులా ఉండిపోయింది కొంతసేపు.

నెమ్మదిగా తేరుకుని తన భుజం మీద వర్షిస్తున్న నా కళ్లను తన మెత్తని చేతితో తుడిచి నా తల నిమిరింది.

అమ్మ పెదవుల మీద చాన్నాళ్లకి సన్నగా నవ్వు మొలిచింది.

అమ్మ నన్ను క్షమించింది.

*(అక్టోబర్ 2011 చినుకు మంత్లీ)*